క్లుప్తంగా

రుణాల రికవరీకి రైతులు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న రైతులు, చైర్మన్

సారంగాపూర్: రైతులు పొందిన రుణాల వసూలుకు సహరించాలని సారంగాపూర్ సొసైటీ అధ్యక్షుడు ఏలేటి నర్సింహరెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ఆవరణలో రైతులతో జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘానికి మరో భవన నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో సీఈవో ఎండీ. ఇస్మాయిల్, రైతులు, సంఘ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగిత్యాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. జాతీయ పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు మొదటి నెల నుంచి రెండేళ్ల వరకు వెయ్యి రోజుల కాల వ్యవధిలో తీసుకోవాల్సిన పోషకాహారం, రక్తహీనత గురించి వివరించారు. ప్రతి ఇంట్లో న్యూట్రి గార్డెన్ పెట్టాలని తల్లులకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్‌పై వివరించారు.

సంక్షేమ పథకాలతో లబ్ధిపొందాలి



యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంత మహిళలు, యువతీ, యువకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ లబ్దిదారుల ఎంపికపై పరిశీలించారు. అనంతరం లబ్దిదారులు ప్రభుత్వం ఇచ్చే రాయితీతో యూనిట్లు నెలకొల్పుకుని లబ్ధిపొందాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి, ఉపాధిహామీ కూలీలకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న తపస్ అధ్యక్షుడు దేవయ్య

జగిత్యాల: ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవయ్య, ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం తపస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం డీఏ ఇవ్వాలని, 317 జీవోను పునఃసమీక్షించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహ అధ్యక్షుడు నరేందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజశేఖర్, వెంకటరమణరావు, రాజేంద్రప్రసాద్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇవీ మంచినీళ్లే..!



జగిత్యాల: ఈ ఫొటోలో కన్పించేది మున్సిపల్ ట్యాప్ వాటర్. నల్ల రంగులో వస్తున్నాయి. బల్దియా అధికారులు సరఫరా చేసిన నీరు పట్టుకోగా పూర్తిగా నల్లరంగులో వచ్చాయి. కొద్ది రోజులుగా కొద్దికొద్దిగా వస్తున్నాయని, మొదట్లో తెలియక తాగడంతో ఇటీవల అనారోగ్యం పాలైనట్లు బాధితులు తెలిపారు. 10 రోజులుగా మురికి నీరు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

సమన్వయంతో పని చేయాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వేసవిలో నీటి, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. అంతకు ముందు కౌన్సిలర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కమిషనర్ మోహన్, అధికారులు పాల్గొన్నారు.

రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి

కోరుట్ల రూరల్: యాసంగి వరి సాగు చేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎంపీపీ తోట నారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో యాసంగి పంటకు సరిపడ నీళ్లు లేవని ఈ నెల 24 వరకు మాత్రమే వచ్చే అవకాశాలున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా రివర్స్ పంపింగ్ చేసి శ్రీరాం సాగర్ డ్యాంలోకి నీళ్లు తెచ్చారని ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. రైతులు నీటి సదుపాయం కల్పించుకుని పంటలు కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లన్నీ సుందరంగా తీర్చిదిద్దుతాం

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో రూ. 3లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ దొంటి శాంత, నాయకులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

మల్లాపూర్: నైజాం, భూస్వాముల మీద అలుపెరుగని పోరాటం చేసిన తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ అని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని మొగిలిపేటలో మంగళవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేష్, ఎంపీటీసీ ఓన సత్తెమ్మ రాజరెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. వదిలేశారు

- నిలిచిన బీటీ రోడ్డు పనులు
- ప్రయాణికుల అవస్థలు



సంగెం- నాగులపేట గ్రామాల మధ్య కంకర వేసిన రోడ్డు

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణ శివారు జంబి గద్దె నుంచి సంగెం గ్రామం మీదుగా నాగులపేట వరకు బీటి రోడ్డు నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ నిధులు రూ. 1.35 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ పూర్తి కాగానే నాగులపేట నుంచి సంగెం గ్రామం వరకు పనులు ప్రారంభించారు. రెండు నెలల క్రితం పాత రోడు తవ్వి కంకర వేసి వదిలి పెట్టారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో కంకర రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

నిత్యం రద్దీగానే..

రెండు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు ప్రతీ రోజు రద్దీగానే ఉంటుంది. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, నాగులపేట హైస్కూల్‌కు సంగెం విద్యార్థులు కాలి నడకన, సైకిళ్లపై వెళ్తుంటారు. కాలి నడకన కూడా ఎంతో మంది వెళ్తుంటారు. రెండు నెలల క్రితం రోడ్డు తవ్విన సమయంలో నెల రోజుల పాటు బస్సులు నడవక పోవటంతో పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంగెం, నాగులపేట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాలలో సరైన వసతులు లేక సిబ్బంది, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కాసిపాక అరవింద్, జయంత్, గోపి, పవన్‌కల్యాణ్, విఘ్నేష్, సాయిరాం, నాగరాజ్, ప్రదీప్ తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మల్లాపూర్: ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించి మొక్కజొన్న పంట చేతికొచ్చి నెలరోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. ఇదే అదనుగా రైతుల వద్ద నుంచి తక్కువగా దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయికల్: మండలంలోని భూపతిపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పుణ్యాహవచనం, రక్షబంధనం, అంకురార్పన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సంకోజి మహేశ్ తెలిపారు.

ఐస్‌క్రీం ఫ్యాక్టరీ సీజ్

మెట్‌పల్లి: పట్టణంలోని వేంపేట రోడ్ లోని తేజ ఐస్‌క్రీం ఫ్యాక్టరీని మున్సిపల్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. లైసెన్స్ లేకపోవడంతో పాటు పలు నిబంధనలు పాటించడం లేదని గుర్తించి ఫ్యాక్టరీని సీజ్ చేశారు. నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ తెలిపారు.

దివ్యాంగులు నమోదు చేసుకోవాలి

జగిత్యాల: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగజన్ కౌశల్ వికాస్ దివ్యాంగ రోజ్‌గార్ సేతు అనే మాడ్యుల్‌ను అభివృద్ధి చేసిందని, ఇది వికలాంగులకు ఎంతో ఉపయోగకరమని జిల్లా సంక్షేమాధికారి వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులకు నైపుణ్య శిక్షణ, ఉపాధిపై ఆసక్తి ఉన్న వికలాంగులను ప్రోత్సహించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని,దివ్యాంగులు www.pmdaksh.depwd.gov.in లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

సీఏఏ అమలుపై సంబరాలు

జగిత్యాలటౌన్: సీఏఏ అమలుపై భారతీయులందరూ సంతోషిస్తున్నారని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో మంగళవారం బీఎస్ఎస్ ప్రతినిధులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, ప్రతినిధులు నరేందుల శ్రీనివాస్, దుబ్బరాజం, గంగారాం, రత్నాకర్, మురళి, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ధర్మపురి: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తీసుకునే జాగ్రత్తలు, సేవలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వైపరీత్యాలను, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఈనెల 18 వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. ధర్మపురి పట్టణంలోని గోదావరి తీరంలో మంగళవారం ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్ట్రక్టర్ రవీంద్రకుమార్ 10 బెటాలియన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భూకంపాలు, అగ్నిప్రమాదాలు, వరుదలు తదితర సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఇన్‌స్ట్రక్టర్ రాజేంద్రకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కౌన్సిలర్ సంతోషి, పద్మ, టెన్త్ బెటాలియన్ సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ ప్రతినిధులు

రైతులు వీడియో కాన్ఫరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మల్యాల: పంటల దిగుబడి, సస్య రక్షణ చర్యలకు రైతు వేదికల్లో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మామిడి తోటల పూత, పిందె రాలకుండ తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు డాక్టర్ సుచిత్ర, జి.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి వాణి మాట్లాడుతూ రైతుల కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పంటలపై శాస్త్రవేత్తల సలహాలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో మామిడి పిందలు రాలడంపై వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర రైతులకు అవగాహన కల్పించారు. మామిడిపిందలు రాలకుండా ఏ విధంగా చర్యలు చేపట్టాలో వివరించారు. అధిక ఉష్ణోగ్రతతో వివిధ పంటల్లో జరిగే నష్టాల నివారణకు శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సేంద్రియ పద్ధతుల అవశ్యత గురించి శాస్త్రవేత్త డాక్టర్ ప్రగతి కుమారి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేశ్, ఏఈవోలు నరేశ్, హరీశ్, శ్యామ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం

జగిత్యాలటౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని న్యాయవాది భీమనాతిని ఉమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉమాదేవి మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే తమ కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దుకోగలగుతారన్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మహిళలు విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ వొద్ది శ్రీలత,రచయిత్రి కోటగిరి సంధ్యారాణి, ఆవాస ప్రముఖ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమాదేవి

విద్యార్థుల వీడ్కోలు వేడుక



రాయికల్/కథలాపూర్: రాయికల్ మండలంలోని భూపతిపూర్ జెడ్పీహెచ్ఎస్, కథలాపూర్ మండలం భూషణరావుపేట, కథలాపూర్ జెడ్పీ హైస్కూళ్లలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు ఏర్పాటు చేశారు. సబ్జెక్టులవారీగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమణి, రాజయ్య, విష్ణు, ఎస్ఎంసీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ ముత్యంరెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్లు ప్రేమ్‌సాగర్, చిన్నారెడ్డి, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బాదినేని రాజమణి

బుగ్గారం: రానున్న వేసవిలో సాగు,తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బుగ్గారం ఎంపీపీ బాదినేని రాజమణి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాజమణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా పలు శాఖల అధికారులు హాజరై తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల తీరుతెన్నులను సభలో ప్రస్తావించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు తమ తమ ప్రాంతాలలో గల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మాట్లాడుతూ అధికారిక కార్యక్రమాలకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. మండలంలో నూతనంగా చేపట్టే ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణం ఆలస్యమవుతుందని ఇందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. లేదంటే నిధులు వెనక్కు పోయే ప్రమాదం ఉందన్నారు. మనఊరు మనబడిలో భాగంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు సభలో ప్రస్తావించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ సంబంధిత అధికారులు నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. నీటి సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వెల్గొండ ఎంపీటీసీ లక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దునూర్ ఎంపీటీసీ గాలిపెల్లి మహేష్ మాట్లాడుతూ తమ గ్రామ కార్యదర్శి ఇంటిపన్నులు వసూలు చేస్తున్నప్పటికీ రికార్డుల్లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు ఈ విషయమై దృష్టి సారించాలన్నారు. ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తుల్లో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశానికి హాజరుకాని వివిధ శాఖల అధికారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఎంపీడీవో శ్రీనివాస్,తహసీల్దార్ మాజిద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ జీరో బిల్లు కోసం లబ్ధిదారుల పరుగులు



కేంద్రంలో బారులుతీరిన జనం

పెగడపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు పరుగెడుతున్నారు. మండలంలో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ జీరో బిల్లు కోసం 11786 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో జీరో బిల్లు అమలు కాని వారు మరోసారి దరఖాస్తులు తీసుకుని ఆన్‌లైన్ చేసేందుకు దరఖాస్తు చేసేందుకు కార్యాలయానికి తరలివచ్చారు. వివిధ గ్రామాల నుంచి జీరోబిల్లు రానివారు మంగళవారం వరకు 310 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇక్కడ రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ చేస్తున్న సర్వర్ బిజీగా ఉంటుండంతో గంటల తరబడి వేచి చూడాల్సిన వస్తోందని దరఖాస్తులుదారులు వాపోతున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీవో రామ్‌రెడ్డి మాట్లాడుతూ అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యం

కొండగట్టు: కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం తిర్మలపూర్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతీ పౌరుడు ఎంత కష్టపడైనా ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. రాజ్యాంగం వల్లే తాను ఎమ్మెల్యే అయ్యానన్నారు. ఎస్సీ,ఎస్టీ చట్టం తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనన్నారు. రాష్ట్రంలో దొరల రాజ్యం పోయి ప్రజల రాజ్యం వచ్చిందని తెలిపారు. అనంతరం శనివారంపేటలో మున్నూరుకాపు కుల సంఘ భవనాన్ని ప్రారంభించి,పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ నాయకులు లక్ష్మణ్,రఘు, మహేశ్, ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, కమలాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయొద్దు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

జగిత్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు బయోమెట్రిక్ విధాన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి బయోమెట్రిక్ విధానం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో తమ సమస్యలపై అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రమేశ్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

తాగునీటి అవసరాలకు రూ. కోటి నిధులు

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో తాగునీటి అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 కోటి ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో పర్యటించినప్పుడు పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లగా రూ. కోటి మంజూరు చేశారని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలకు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పద్మపాణి సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ శిబిరానికి సుమారు 80 మందికి పైగా తరలివచ్చారు. వారందరికీ అవసరమగు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి,సొసైటీ సూపర్‌వైజర్, సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహేందర్

జగిత్యాలటౌన్: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెండెం మహేందర్ ఎన్నికయ్యారు. మంగళవారం దేవిశ్రీ గార్డెన్స్‌లో జరిగిన నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికల్లో నూతన ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మర్రిపెల్లి గంగరాజం, కార్యదర్శిగా రాచమల్ల శ్రీనివాస్ ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని కళాశ్రీ గుండేటి రాజు, ఎన్నం కిషన్‌రెడ్డి, సిరిసిల్ల వేణుగోపాల్, ఊటూరి శ్రీనాథ్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పాడిపశువుల పోషణపై నేడు అవగాహన

కోరుట్ల: పట్టణంలోని పీవీ నర్సింహారావు పశువైద్య విద్యాలయంలో 'శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పోషణ' అంశంపై నేడు కోరుట్ల పరిసర ప్రాంతాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోషియేట్ డీన్ మాధవరావు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.